



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# మంజుల

## (విజయచిత్ర 1983 ఆగస్టు సంచిక నుంచి)



ప్రియమైన పాఠకులకు

నమస్తే...

నిజం చెప్పొద్దూ. చిన్నప్పటినుంచి నాకు సినిమాలంటే తెగ పిచ్చి, తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీషు సినిమాలు బాగా చూసేదాన్ని. నా మాతృభాష తమిళమే అయినా మా నాన్నగారు రైల్వేలో ఉద్యోగం చేస్తూ వుండడం వల్ల ఒక ఊరు నుంచి మరో ఊరికి, ఆ మరో వూరు నుంచి ఇంకో ఊరికీ ఇలా తరచుగా ట్రాన్స్ఫర్ అవుతూ వుండేవారు. ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మేము మారుతూ వుండడం వల్ల నేను తెలుగు ,కన్నడం, హిందీ భాషలు నేర్చుకోడానికి బాగా వీలైంది. ఇక చదువంటారా మద్రాసులో 'గుడ్ షెఫర్డ్ కాన్వెంట్'లో చదువుకోవడం 'మెట్రిక్'తో పుల్‌స్టాప్ పెట్టేయడం జరిగింది.

చిన్నప్పటి నా సినిమా పిచ్చి ఎంతవరకూ వచ్చిందంటే రేడియోలో సినిమా పాటలు వస్తే అప్పటికప్పుడు నాకు తోచినట్టుగా 'డాన్స్' చేసేదాన్ని. ఒకసారి ఏమైందంటే ఒక కన్నడ చిత్రంలో నటించడానికి ఇద్దరు ముగ్గురు బాలికలు కావాలని మా కాన్వెంట్‌కు ఎవరో

వచ్చారు. ఆ తర్వాత ఏమైందని నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. ఒక రోజు నన్ను మా వాళ్ళు స్టూడియోకు తీసుకు వెళ్ళారు. అప్పుడు తెలిసింది. "నేను సినిమాలో నటించబోతున్నానని" అక్కడ వాళ్ళెలా నటించమంటే అలా నటించేశాను. నేను ఎలా నటించానని నాకే ఆలోచనలేదు. 'సినిమాలో నటించాను' అని మాత్రం అప్పుడు గొప్పగా అనుకున్నాను. ఆ చిత్రం పేరు 'మధువైమాడినోడు' అప్పుడు నా వయసు పది సంవత్సరాలు వుంటుందేమో.

ఇక ఆ తర్వాత నుంచీ సినిమాల పట్ల ఆసక్తి నాలో ఇంకా ఎక్కువైంది. ప్రముఖ తమిళ సంగీత దర్శకులైన శంకర్ – గణేశ్‌లలో గణేశ్‌గారు మా కుటుంబానికి ఆప్తులు. ఒకసారి 'శాంతినిలయం' అన్న తమిళ చిత్రం నిర్మింపబడుతూ వుండగా ఆ చిత్రంలో కథానాయకుని సంతానంలో ఒక చిలిపి అమ్మాయిగా నటించడానికి 'ఎవరైతే బావుంటారా' అని నిర్మాతలు ఆలోచిస్తున్నారట. గణేష్ గారు నా గురించి చెప్పారట. ఆ తర్వాత వాళ్ళు రావడం, నన్ను చూసి 'సెలక్ట్' చేయడం జరిగింది. అప్పటికి మా ఇంట్లో వాళ్ళు నా 'సరదా'ని చూసి ఊరుకున్నారేకానీ నేను 'సీరియస్‌గా' సినిమా నటిని అవుతానని ఎంతమాత్రం అనుకోలేదు. ఆ మాట కొస్తే అప్పటికి నాకూ ఆ భావం కలగలేదు.

'శాంతినిలయం' చిత్రంలో నేను కళ్ళజోడు వేసుకుని తమాషాగా కనిపిస్తాను. అంచేత అంతా నన్ను 'కన్నాడి మంజుల' అని పిలవడం ఆరంభించారు. 'కన్నాడి' అంటే కళ్ళజోడని అర్థం. ఆ తర్వాత 'మనుషులు మారాలి', 'ధర్మపత్ని', 'జైజవాన్' తెలుగు చిత్రాలలో పెద్దగా ప్రాముఖ్యత లేకపోయినా, మంచి పాత్రలనే ధరించాను.

'శాంతినిలయం' చిత్రం విడుదలైన సందర్భంలో పత్రికలు వారు నా గురించి రాస్తూ, కొన్ని పోటీలను కూడా ప్రకటించారు. ఆ పోటీలను సుప్రసిద్ధ తమిళ నటులు శ్రీ యం.జి.ఆర్‌గారు చూశారు. అప్పుడే నా జీవితంలో ఒక కొత్త మలుపు ప్రారంభమైంది. య.జి.ఆర్‌గారు నన్ను పిలిపించి వారి చిత్రాలలో నటించడానికి ఐదు సంవత్సరాలు ఒప్పందం ఏర్పాటు చేయించారు. ఈ సంఘటన కలా నిజమా అన్నట్లుగా నాకు దిగ్భ్రాంతి కలిగించింది. కారణం య.జి.ఆర్‌గారి అసంఖ్యాకమైన అభిమానులలో నేనూ ఒకర్తెను. ఎప్పుడైనా దూరం నుంచి ఆయనను చూసినప్పుడు ఒకసారి కరచలనం చేసే అవకాశం లభిస్తే ఎంత బావుండును అని అనుకునేదాన్ని. అలాంటిది ఆయన ప్రక్కనే హీరోయిన్‌గా నటించే అవకాశం అనుకోకుండా లభించింది. ఆ చిత్రమే 'రిక్షాకారన్', ఆ తర్వాత 'ఉలగం సుట్రుం వాలిబన్' చిత్రంలో విదేశాలలో జరిగిన షూటింగ్‌లో కూడా పాల్గొన్నాను. నూతన నటినే అయినా నాటకానుభవం లేకపోయినా నాకు చక్కని ప్రోత్సాహాన్ని, మంచి శిక్షణనూ ఇచ్చి యం.జి.ఆర్‌గారు నా నట జీవితానికి ఉజ్జ్వలమైన భవిష్యత్తును ఏర్పరచారు. అలాగే ప్రఖ్యాత నటుడు శ్రీ శివాజీగణేశన్‌గారి ప్రక్కన నాయికగా నటించే అవకాశం 'ఎంగళ్ తంగరాజా' చిత్రంలో లభింపచేశారు. ప్రముఖ దర్శక నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్‌గారు.

తెలుగులో నాకు 'హీరోయిన్' పాత్రలో ప్రప్రథమంగా అవకాశాన్ని కల్పించినవారు సుప్రసిద్ధ దర్శకులు ఆదుర్తి సుబ్బారావుగారు. వారి 'మాయదారి మల్లిగాడు' చిత్రంలోని నా 'చంద్రి' పాత్ర మిమ్మల్నందర్నీ ఆకట్టుకుంటుందని నా

నమ్మకం. అలాగే గౌతమీవారి 'వాడే వీడు' ఉమా ప్రొడక్షన్‌వారి 'మరపురాని మనిషి' చిత్రాల్లో నాకు చక్కని పాత్రలు లభించాయి. పద్మాలయా పిక్చర్స్‌వారి 'దేవుడు చేసిన మనుషులు' చిత్రంలో నేను గెస్ట్ ఆర్టిస్ట్‌గా పాల్గొన్నాను.

విశేషమేమిటంటే చాలా తక్కువ కాలంలో ప్రముఖ హీరోలు అందరి ప్రక్కనా నటించే అవకాశాలు నాకు లభ్యమయ్యాయి. అది నా అదృష్టమేననుకుంటాను.

పెద్దవారితో నటిస్తున్నప్పుడు నటనకు సంబంధించి ఎన్నో కొత్త విషయాలు తెలుస్తూ వుంటాయి. ముఖ్యంగా యన్.టి.ఆర్‌గారూ, అక్కినేని నాగేశ్వరరావుగారూ, కృష్ణగారూ నాకిచ్చిన ప్రోత్సాహానికీ, తెలుగు చిత్రాల్లో నటించే అవకాశాలు కల్పించి నా పట్ల ఆదరణ చూపుతూ వున్న నిర్మాతలకూ నేనెప్పటికీ కృతజ్ఞురాలై వుంటాను.

ఇక నా నటనను గురించి చెప్పి, నన్ను తీర్చిదిద్ది నన్ను ప్రోత్సహించవలసింది మీరే..మీ ఆదరణను కూడా నేను తప్పక సాధించగలనని విశ్వసిస్తున్నాను.

Post your comments